రేషన్ కావాలంటే 8 కి.మీ.లు నడవాల్సిందే
- ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్న నాలుగు గ్రామాల గిరిజనులు

కోనాంలో జిల్లాస్థాయి ఆదివాసీ దినోత్సవం
- డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

-8లో

బల్క్ డ్రగ్ పార్కు వద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజా సంఘాలు, సీపీఎం, వైసీపీ డిమాండ్



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో వీవీ రమణ



సభకు హాజరైన పలు గ్రామాల ప్రజలు, నాయకులు

- ఇప్పటికే హెటెరో, డెక్కన్ కంపెనీలతో ఈ ప్రాంతం కాలుష్యమయమైందని ఆందోళన
- ప్రాణాంతక వ్యాధులతో జీవితాలు నాశనం
- నిర్వాసితులకు న్యాయం చేయాలన్న టీడీపీ

అనకాపల్లి/నక్కపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుపై బుధవారం ఉదయం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పర్యావరణం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో మత్స్యకార, ప్రజా సంఘాల నాయకులు.. ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గతంలో ఏర్పాటు చేసిన హెటెరో డ్రగ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల కారణంగా జల, వాయు కాలుష్యం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావం వల్ల అనేక మంది కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇటువంటి సమయంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటైతే తమ ప్రాణాలకు మరింత ముప్పు వాటిల్లుతుందని మండిపడ్డారు.

కాకినాడ జిల్లాలో ఏర్పాటుచేయాల్సిన బల్క్ డ్రగ్ పార్కును గత వైసీపీ ప్రభుత్వం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు మార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో బల్క్ డ్రగ్ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 1,270 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం నక్కపల్లి మండలం సీహెచ్ఎల్ పురం, పెదతీనార్ల, చినతీనార్ల, ఎన్.నర్సాపురం, ఉపమాక, గుర్రాజుపేట, రాజయ్యపేట, ఎస్.రాయవరం మండలం గుడివాడ గ్రామాల పరిధిలో ఉన్న రైతులు, మత్స్యకారుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపారు. తొలుత నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.నరసింహారావు.. బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి కొన్ని వివరాలు వెల్లడించారు. అనంతరం ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పుకోవాలన్నారు. ఎస్.రాయవరం గుర్రాజుపేటకు చెందిన ఉమాదేవి మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటుకు ఇక్కడ భూములు తీసుకుంటున్నారని, కానీ ఆయా పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని అన్నారు. ఫార్మా, రసాయన పరిశ్రమల ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హెటెరో పరిశ్రమ రాకముందు ఎకరా కొబ్బరి తోటలో ఏటా ఐదు వేల కాయల దిగుబడి వచ్చేదని, ఇప్పుడు 500 కాయలు కూడా రావడం లేదన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశారు.



వేదిక సమీపాన ఆందోళన చేస్తున్న రైతులు

ఉపమాకకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పి.శ్రీనుబాబు మాట్లాడుతూ, హెటెరో కంపెనీలో ఉద్యోగానికి దరఖాస్తు చేయగా, స్థానికుడు కావడంతో ఉద్యోగం ఇవ్వలేదని చెప్పారు. హెటెరో కంపెనీ వెదజల్లే కాలుష్యంతో ఇప్పటికే పలురకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, అందు వద్ద బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని కోరారు.

వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, ప్రజలను ఇబ్బంది పెట్టే పరిశ్రమలు ఏర్పాటు చేయకూడదని అన్నారు. కాకినాడ జిల్లా ప్రజలు వద్దన్న బల్క్‌డ్రగ్ పార్కును నక్కపల్లి మండలంలో ఎలా ఏర్పాటు చేస్తారో హోం మంత్రి అనిత సమాధానం చెప్పాలన్నారు.

ప్రజా సంఘాలు, వైసీపీ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, డీవీఎస్ఎన్ రాజు, శీరం నరసింహమూర్తి, రాజాన దొరబాబు, మహదేవ్, చోడిపిల్లి అప్పన్న, ప్రసాదుల శ్రీనుతోపాటు టీడీపీ, జనసేనలకు చెందిన మత్స్యకార నాయకులు పిక్కి కోదండ, పిక్కి సత్తియ్య, బైరాగిరాజు, పిక్కి స్వామి, ప్రసాదుల శ్రీను ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నానికి మహర్దశ

ముసాయిదా బృహత్తర ప్రణాళికను ప్రకటించిన వీఎంఆర్‌డీఏ

- భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపకల్పన
- ఆరు రాష్ట్ర రహదారులు వంద అడుగులకు విస్తరణ
- పట్టణంలో కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు
- 150 అడుగుల వెడల్పు, 21 కిలోమీటర్ల పొడవున ఔటర్ రింగ్ రోడ్డు



మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించిన నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వెళ్లే రహదారి

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం ముసాయిదా బృహత్తర ప్రణాళికను వీఎంఆర్‌డీఏ ప్రకటించింది. దీనిని సబ్ కలెక్టర్, మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. తెలుగుదేశం పార్టీ 2014-19లో అధికారంలో వున్నప్పుడు రాష్ట్రంలో నర్సీపట్నంతోసహా 32 మునిసిపాలిటీలకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పక్కన పెట్టేసింది. గత ఏడాది టీడీపీ ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి రావడంతో మునిసిపాలిటీల బృహత్తర ప్రణాళికను రూపొందించడానికి అదే ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. రానున్న 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. నివాస ప్రాంతాలు, వాణిజ్య/వ్యాపార ప్రాంతాలు, పరిశ్రమలు, ప్రజావసరాలు, పచ్చదనం పెంపు, రిక్రియేషన్, ట్రాన్స్‌పోర్ట్, వ్యవసాయ రంగాలను జోన్లుగా ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న రహదారులను విస్తరించడంతోపాటు కొత్తగా మరో ఐదు రహదారులను అభివృద్ధి చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. స్టేట్ హైవే పరిధిలో ఉన్న నర్సీపట్నం- కృష్ణాదేవిపేట, నర్సీపట్నం-చోడవరం, నర్సీపట్నం- తాళ్లపాలెం, నర్సీపట్నం-అడ్డరోడ్డు, నర్సీపట్నం- తుని, నర్సీపట్నం- చింతపల్లి రహదారులను మునిసిపాలిటీ పరిధిలో 100 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. పట్టణంలో శ్రీకన్య కూడలి నుంచి బలిఘట్టం వరకు, వై జంక్షన్ నుంచి అడ్డరోడ్డు వరకు 80 అడుగుల రహదారిని ప్రతిపాదించారు. నర్సీపట్నం చుట్టు 21 కిలోమీటర్ల మేర 150 అడుగుల వెడల్పుతో ఔటర్ రింగ్ రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. మునిసిపాలిటీని ఆనుకొని ఉన్న కృష్ణాపురం, ధర్మసాగరం, ఆర్డనరీ లక్ష్మీపురం, గుండుపాల, వీరభూపాలపురం, గురందొరపాలెం, చెట్టుపల్లి దుగ్గాడ గ్రామాలను కలిపి మాస్టర్ ప్లాన్‌ను ప్రతిపాదించారు. భవిష్యత్తులో ఈ గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేస్తే ఆయా గ్రామాల్లో మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తుందని మునిసిపల్ అధికారులు తెలిపారు.

రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు

కృష్ణాబజార్ నుంచి చోడవరం రోడ్డు, పోలీస్ స్టేషన్ నుంచి కృష్ణాదేవిపేట రోడ్డు, తుని రోడ్డు నుంచి బలిఘట్టం ఉత్తరవాహిని రోడ్డును 40 అడుగుల చొప్పున, నర్సీపట్నం గుర్రాల రోడ్డు, కృష్ణాబజార్ నుంచి ఓఎల్‌పురం వరకు 60 అడుగుల మేర రోడ్లను ... మిగతా 8వ పేజీలో

తప్పని శవ జాగారం

చోడవరంలో అందుబాటులోకి రాని పోస్టుమార్టం భవనం

- రెండు నెలల క్రితమే నిర్మాణం పూర్తి
- ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రమాద మృతుల కుటుంబీకుల ఇక్కట్లు
- పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీ వద్ద నిరీక్షణ

చోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో మార్చురీ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, ప్రారంభించడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మాడుగుల, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లో పోలీసు కేసులు నమోదైన మరణాలకు సంబంధించిన మృతదేహాలకు పోస్టుమార్టం చేయించడానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించాల్సి వస్తున్నది. దీంతో బాధిత కుటుంబాలు, పోలీసులు మార్చురీ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది.

చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్ల క్రితం వరకు మార్చురీ వుండేది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, పోలీసు కేసులు నమోదయ్యే ఇతర మరణాలకు సంబంధించి మృతదేహాలను ఇక్కడకు తీసుకువచ్చేవారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు సొంతూరు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే మార్చురీ భవనం శిథిలావస్థకు చేరడంతో అందులో పోస్టుమార్టం చేయడానికి వైద్యులు విముఖత చూపారు. దీంతో మార్చురీని మూసివేసి, పోస్టుమార్టం కోసం మృతదేహాలను అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. సంఘటన స్థలం నుంచి మృతదేహాన్ని అనకాపల్లి తరలించడం నుంచి పోస్టుమార్టం అనంతరం తిరిగి సొంతూరుకు ... మిగతా 8వ పేజీలో



ప్రారంభానికి నోచుకోని పోస్టుమార్టం కేంద్రం నూతన భవనం

సీఎం పాడేరు పర్యటన ఖరారు

- వంజంగి గ్రామ సమీపంలో కాఫీ రైతులతో చంద్రబాబు ముఖాముఖి
- అక్కడికి సమీపంలో బహిరంగ సభ



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న పెందుర్తి వెంకటేశ్

పాడేరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాడేరు మండల పర్యటన దాదాపుగా ఖరారైంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయన గిరిజన ప్రాంతంలో పర్యటించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సీఎం ఈ నెల 9న పాడేరు మండలం వంజంగి గ్రామానికి ఆనుకుని ఉన్న కాఫీ తోటల్లో పలువురు గిరిజన రైతులతో ముచ్చటిస్తారు. అనంతరం లగిశపల్లి, ఉగ్గంగొయ్యి గ్రామాలకు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గిరిజనులను ఉద్దేశించి మాట్లాడతారు. సీఎం పాడేరు పర్యటన నేపథ్యంలో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించేందుకు సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ బుధవారం ఇక్కడికి వచ్చారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇది డ్రైనేజీ కాదు.. పంట కాలువ!

చెర్లోపలి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- పొలాలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన
- కాలువను శుభ్రం చేయించని జీవీఎంసీ అధికారులు



సుంకరమెట్ట జంక్షన్ వద్ద చెర్లోపలి కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం


అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణానికి ఆనుకొని వున్న భూములకు సాగు నీరు అందించే చెర్లోపలి కాలువలో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది.

అనకాపల్లి మండలం తుమ్మపాల వద్ద శారదా నదిపై నిర్మించిన గ్రోయిన్ ద్వారా చెర్లోపలి కాలువకు నీరు చేరుతుంది. ఈ కాలువ సుమారు రెండు కిలోమీటర్లు అనకాపల్లి పట్టణం మధ్యలో నుంచి వెళుతుంది. గతంలో పంట కాలువకు ఆనుకొని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలంలో మునిసిపల్ అధికారులు డ్రైనేజీ కాలువ నిర్మించారు. అప్పట్లో జరిగిన ఒప్పందం మేరకు పట్టణ పరిధిలో పంట కాలువ నిర్వహణ (పూడిక తీత) జీవీఎంసీ చేయాలి. కానీ సిబ్బంది కొరత, ఇతర కారణాల వల్ల కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను జీవీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు తొలగించడంలేదు. దీంతో కాలువలో పూడిక పేరుకుపోయి పంటపొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సుంకరమెట్ట జంక్షన్ నుంచి సత్తెమ్మతల్లి ఆలయం వరకు కాలువలో పెద్ద ఎత్తున చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దోమల బెడద పెరిగిపోయింది. ఈ సమస్యపై జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. పారిశుధ్య విభాగం సిబ్బందితో కాలువలో చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రెవెన్యూ సేవలు వేగవంతం

పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

- 15 నాటికి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ
- 25వ తేదీలోగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలి
- కలెక్టర్ విజయకృష్ణన్
- రెవెన్యూ అధికారులతో సమీక్ష



సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవలను అధికారులు మరింత వేగవంతం చేయాలని, ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు అందుతున్న అర్జీలను తహసీల్దార్లు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖ పరంగా అందిన అర్జీలు, ఇతరత్రా రెవెన్యూ సేవలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ జాహ్నవితో కలిసి సమీక్షించారు. ఆయా అర్జీలపై క్షేత్ర పర్యటనలు జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. పక్కా ఇళ్ల కోసం అందిన అర్జీలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. వివాదాలు లేని ఆక్రమిత భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 15వ తేదీనాటికి కొత్త పట్టదారుపాస్ పుస్తకాలు జారీ చేసేందుకు, 25 నాటికి కొత్త స్మార్టు రేషన్ కార్డులు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశానికి డీఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ షేక్ ఆయిషా, డీసీఎస్ఓ కేఎల్ఎన్ మూర్తి, జిల్లా సర్వే విభాగం అధికారులు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సర్వేయర్లు హాజరయ్యారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి 9, వైసీపీకి 1

ఓటింగ్‌కు ఐదుగురు కార్పొరేటర్లు గైర్హాజరు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి తొమ్మిది స్థానాలు గెలుచుకోగా, వైసీపీ ఒక స్థానం దక్కించుకుంది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు టీడీపీ నుంచి తొమ్మిది మంది, బీజేపీ నుంచి ఒకరు, వైసీపీ నుంచి పది మంది నామినేషన్ దాఖలు చేశారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం పది గంటలకు పోలింగ్ మొదలైంది. మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది కార్పొరేటర్లు ఓటు హక్కు కలిగివుండగా, వారిలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్; సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, 91వ వార్డు కార్పొరేటర్ కుంచెజోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత ఓటింగ్‌కు హాజరుకాలేదు. 92 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో వైసీపీకి 32 మంది కార్పొరేటర్లు మద్దతు ఉండగా, మిగిలిన 60 మంది టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారు ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రౌండ్‌కు 24 ఓట్లు చొప్పున నాలుగు రౌండ్లలో లెక్కింపు జరిగింది. నాలుగురౌండ్‌ల ... మిగతా 8వ పేజీలో



ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ, బీజేపీ సభ్యులతో మేయర్ శ్రీనివాస్

ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే భూముల సర్వే చేపట్టండి

▸▸ ఆర్డీవో కార్యాలయంలో చీమలాపల్లి పంచాయతీ రైతుల వినతి



ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

అచ్యుతాపురం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే రోడ్డుకు భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు బుధవారం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. చీమలాపల్లి పంచాయతీ అప్పన్నపాలెం వద్ద భూముల సర్వేను అధికారులు చేపట్టారన్నారు. దీనిపై ప్రశ్నించగా, అచ్యుతాపురం రింగ్ రోడ్డుకని చెప్పారని తెలిపారన్నారు. తమకు తెలియకుండా తమ భూములు ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. సర్వేను నిలిపివేసి, ముందుగా రైతు అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ఆ తరువాతే ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమలో కె.సోమునాయుడు, తమరాన బాబూరావు, రెడ్డి వెంకట రమణ, రెడ్డి బాబూరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించండి : ధర్మశ్రీ



కట్టుబోలులో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రజాల, కట్టుబోలు, కుమ్మరాపల్లి గ్రామాల్లో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ బుధవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పలువురి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అలాగే, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్‌రాజు, జడ్పీటీసీ ధూళి నాగరాజు, నాయకులు నెట్టం సత్యనారాయణ, గోకివాడ సూర్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్డు, సాయిప్రియ లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం జంక్షన్, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు, ఎస్‌టీబీఎల్ కాలనీలలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అన్నింటా నియోజకవర్గం అభివృద్ధి

▸▸ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ▸▸ అచ్యుతాపురం ఫ్లై ఓవర్ పనుల ప్రగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశం



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో ఎలమంచిలి నియోజకవర్గం ముందుండాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఇక్కడి సెజ్‌లో గల ఏపీఐఐసీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నాలుగు మండలాల్లో గల అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ బ్రిడ్జినిర్మాణ పనుల ప్రగతి నివేదిక ఎప్పటికప్పుడు తనకు ఇవ్వాలన్నారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అచ్యుతాపురంలో తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నట్టు చెప్పారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇలా జరుగుతోందని, వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వ హించాని సూచించారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు, అంటువ్యాధులు వం టివి సోకితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ సాగుకు ఆ శాఖ అధి కారులు రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే, అన్ని శాఖల అధికారులు వారి పరిధిలో చేపట్టాల్సిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ అతిథి గృహంలో 'ప్రజావాణి'

ఎలమంచిలి : ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం ఆయన జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. జనవాణి కార్యక్రమం దృష్టికి వస్తున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. అంతకు ముందు ఆయన పలువురి నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదుగురికి మంజూరైన సాయం పత్రాలను అందజేశారు. ఇటీవల రాష్ట్రస్థాయి పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామానికి చెందిన గండి నానాజీని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పిట్టా శ్రీను, యు.రమేష్, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

'సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శం'



గణపర్తితో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సాయికృష్ణ తదితరులు

మునగపాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిర్వహిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగుర కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, క్లస్టర్ ఇన్‌చార్జి కాండ్రేగుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలికల క్రీడా పోటీలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న తులసీనగర్ పాఠశాల విద్యార్థినులు

ఎలమంచిలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడి తులసీనగర్ జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో విద్యార్థినులకు బుధవారం వివిధ పోటీలు నిర్వహించారు. తొలుత ప్రధానోపాధ్యాయిని కె.సుశీల పోటీలను ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా తలపడ్డారు. వ్యాయాయ ఉపాధ్యాయుడు మూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో స్థానిక నాయకుడు ఆడారి ఆదిమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మలాడలో దేవీతల్లి విగ్రహ ప్రతిష్ఠ



మునగపాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమ్మలాడలో దేవీతల్లి ఆలయ పునః ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వివిధ గ్రామాల నుంచి ఈ వేడుకకు పెద్ద సంఖ్య భక్తులు హాజరయ్యారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, నారాయణరావు, శంకర్, పల్లె అప్పలనాయుడు తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు.

సత్తమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మునగపాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలోని చెరువు కాలువ రైతు మూల సంఘం ప్రాంతంలో సత్తమ్మ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై హర్షం

ఎలమంచిలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : క్యాబినెట్ సమావేశంలో నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్‌ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంత్రి మండలి ఆమోదం తెలపడం హర్షణీయమని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.గోవిందరావు, పి.సత్యనారాయణ ఒకప్రకటనలో తెలిపారు. నాయీ బ్రాహ్మణుల గురించి ఇంతగా ఆలోచించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి మండలికి, అలాగే, ఇందుకు కృషి చేసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివమ్, డైరెక్టర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం'

అచ్యుతాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ ఎలమంచిలి సీడీపీవో ఇందిరా దేవి అన్నారు. అచ్యుతాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. బిడ్డకు పాలివ్వడం వల్ల ఇద్దరికీ మంచి ఆరోగ్యకరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుహాసిని, పద్మలతో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంపునకు 'పేట' విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శ్వేతను అభినందిస్తున్న సీహెచ్‌వీకే.నరసింహారావు

పాయకరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరగనున్న లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంపునకు పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. విజయవాడలో గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు జరుగనున్న లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంపునకు తమ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని టి.శ్వేత ఎంపికైందన్నారు. ఆమె ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఎంపికైన ఏకైక ఎన్‌సీసీ విద్యార్థిని కావడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. కాగా ఎంపికైన విద్యార్థికి విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాశ్, ఎన్‌సీసీ ఏఎన్‌వో పి.సూర్యకుమారితో పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు కోఆపరేటివ్ బ్యాంకు ప్రోత్సాహకాలు

పాయకరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది, షేర్ హోల్డర్ల పిల్లలకు బ్యాంకు యాజమాన్యం బుధవారం నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. 20 మంది టెన్త్ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులకు రూ.7,500 చొప్పన బ్యాకు అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు జోనల్ మేనేజరు ఠాగూర్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు అట్టడుగు వర్గాలకు చేరాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సి.కృష్ణమోహన్, నామన కామరాజు, రావు జగ్గారావు, మేనేజరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవీ చినగుమ్ములూరు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, పెట్టుగొల్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, నక్కపల్లి మండలంలోని పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, పెదదొడ్డుగొల్లు, సీతమ్మపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

'అర్హులకు అందని ప్రభుత్వ పథకాలు'

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందడం లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు అన్నారు. మాసాహెబ్‌పేట గ్రామంలో వైసీపీ నేత జి.శ్రీనువాసరావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' నిర్వహించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందని పరిస్థితి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మాట్లాడుతూ బాబు మోసాలను ప్రజలలోకి తీసుకు వెళ్లాలని కోరారు. నాయకులు ఎల్.సూర్యనారాయణ, డి.బాబూరావు, మహేశ్, డి.సాయిబాబా, జె.శ్రీనివాసరావు, పి.పాపారావు, తాతాజీ పాల్గొన్నారు.

ఆందోళనలు.. నిరసనలు.. నినాదాల హోరు

▸▸ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు పటిష్టచర్యలు



సీపీఎం నేత లోకనాథంను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలలీసులు

నక్కపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారుల నిరసనలు, నినాదాలతో సభావేదిక హోరెత్తింది. ఈ కార్యక్రానికి పోలీసులు కనీవినీ ఎరుగని బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. సీపీఎం స్థానిక నేత ఎం.అప్పలరాజును ధర్మవరంలోని ఆయన స్వగృహం వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఇది తెలుసుకుని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం నక్కపల్లి సభావేదిక వద్దకు రాగానే, పోలీసులు అడ్డగించారు. ఆయన్ను వ్యాన్‌లో ఎక్కించి తీసుకెళ్తుండగా, ఎంపీడీవో కార్యాలయం హైవే జంక్షన్ వద్ద యువకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. గుడివాడకు చెందిన మహిళా రైతు ఉమాదేవి, మరికొందరు మహిళలు బల్క్‌డ్రగ్ వద్దంటూ నల్లబ్యానర్‌తో వస్తుండగా, ఎంపీడీవో కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. చాలా సేపు మహిళలు, మహిళా పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన తరువాత ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ ఉమాదేవి, మహిళలు ఎంపీడీవో కార్యాలయం వద్ద బైఠాయింపు చేసి నిరసన తెలిపారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, కాంగ్రెస్ నాయకుడు మేడేటి శంకర్, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి తదితరులకు మాట్లాడే అవకాశం రాకపోవడంతో, వారంతా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. తరువాత శీరం నరసింహమూర్తి, మేడేటి శంకర్, గొర్ల బాబూరావు తదితరులకు మాట్లాడే అవకాశం కల్పించారు.



ఆందోళన కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న మహిళలు

ముందస్తు అరెస్టులు..

ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి పలువురు నాయకులను పోలీసులు ముందుస్తుగా గృహ నిర్బంధించి అరెస్టు చేశారు.సీపీఎం నేత ఎం.అప్పలరాజును గృహ నిర్బంధం చేసి, సభావేదిక వద్దకు రాకుండా అడ్డుకున్నారు. నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ నాయకులు తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, గోవింద్‌ను అరెస్ట్ చేసి పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజాభిప్రాయసేకరణ వేదిక వద్ద తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ వైస్ ఎంపీపీ వీసం నానాజీ బారికేడ్లను ఎక్కే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కుమారస్వామి, రామకృష్ణ, అప్పన్న బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

8న ఉపమాక క్షేత్రంలో సౌభాగ్యం

నక్కపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ఈ నెల 8వ తేదీన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సౌభాగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. బుధవారం ఆలయంలో సౌభాగ్యం కార్యక్రమ వివరాలు వెల్లడించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారితో పూజ చేసిన పసుపు, కుంకుమ, రక్షా కంకణాలు, గాజులను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా భక్తులంతా పాల్గొన్ని సౌభాగ్య ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగవతం గోపాలాచార్యులు, ముని గిరీశ్, దీప్తి, కె.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

కోటవురట్ల ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోటవురట్ల మండలంలోని బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో బుధవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో పర్యవేక్షించారు. మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని దగ్గర ఉండిమరీ తీయించారు. గ్రామంలో చెత్తచెదారాన్ని తడిపొడి సంపద కేంద్రానికి తరలించాలని ఎంపీడీవో ఆదేశించారు. చెత్తను వర్మీకంపోస్టుగా తయారు చేస్తే పంచాయతీ ఆదాయం వస్తుందని చెప్పారు. అలాగే సంపద కేంద్రం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

బల్క్‌డ్రగ్ పార్కుతో ప్రజా జీవనానికి ప్రమాదం

▸▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం



ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌లో లోకనాథంను నిర్బంధించిన దృశ్యం

ఎస్.రాయవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కు వల్ల ప్రజల జీవన విధానానికి ప్రమాదం వాటిల్లుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం అన్నారు. నక్కపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు వెళ్లిన లోకనాథంను పోలీసులు అడ్డుకొని ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణకు సీపీఎం తరఫున వెళ్లిన తనను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణలో నిజాయితీగా 80 శాతం ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పిన తరువాతే పరిశ్రమ నిర్మించాలన్నారు. సుమారు 1270 ఎకరాల భూమికి గాను 470 ఎకరాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లించారని, ఇంకా 800 ఎకరాలకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉన్నా సంబంధిత రైతులకు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా అభిప్రాయ సేకరణ చేపట్టడం ప్రజలకు అన్యాయం చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డం బుజ్జి ఆరోగ్యం మెరుగుపడాలని ప్రత్యేక పూజలు

పాయకరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆరోగ్యం మెరుగుపడాలని పార్టీ నాయకులు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పాండురంగస్వామి ఆలయంతో పాటు బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, నాయకులు జగ్గన్నదొర, నారపురెడ్డి పద్మావతి తదితరులు గెడ్డం బుజ్జి కోలుకోవాలని పూజలు నిర్వహించారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ ఎస్.రాయవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతికుమార్ మాట్లాడుతూ తమ నేత బుజ్జి కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ వేంకటేశ్వ స్వామికి పూజలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేటకలి అరవింద్, మాలెం రాజు, గొర్లి సతీశ్, బొడ్డా నవీన్, ఆది పాల్గొన్నారు.

నారుమడిలో సస్యరక్షణ చేపట్టాలి

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడిలో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ సూచించారు. మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి వేసిన 17 రోజులకు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు తీయడానికి ఏడు రోజుల ముందు కార్బోఫ్యూరాన్ తక్కువ నీటిలో వేయాలన్నారు. జింకు లోపం ఉంటే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తల్లి పురుగులు గూడును కొనల మీద పెడుతుందని, వరి నాట్లు వేసే ముందు నారు కొనలు తుంచాలని ఆయన చెప్పారు. దీనివల్ల పిలకలు కూడా ఎక్కువగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగమణి, ఎంపీఈవో శరత్ పాల్గొన్నారు.

పెద ఉప్పలంలో పొలం పిలుస్తోంది..

ఎస్.రాయవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉప్పలం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం శిరీష, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను కొబ్బరి తోటల్లో వేసుకుంటే భూమికి మంచి బలం చేకూరుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతతో పాటు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అంతకుముందు గ్రామంలో వరినాట్లను పరిశీలించి, రైతులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్ఠానికి చర్యలు

▸▸ తీరప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్



తీరప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత రక్షణకు, మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్ఠతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి తీరప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మెరైన్ పోలీస్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గత సమావేశంలో తెలియజేసినట్లుగా పోలీస్ స్టేషన్లకు ప్రహరీల నిర్మాణం, మరుగుదొడ్లు, బెంచీల నిర్మాణం, లైట్ల వంటి వాటితో పాటు బోట్లకు మరమ్మతులు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, పర్యాటకులు ఎక్కువగా వచ్చే రోజుల్లో గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో మెరైన్ పోలీస్ స్టేషన్ అధికారులు, మత్స్యశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల ఆందోళన



తాళ్లపాలెం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

కశింకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు తాళ్లపాలెం ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రోగులకు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన సేవలందిస్తున్న ఆశ కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం తగన్నారు. రోగులను ఆసుపత్రికి తరలించే ప్రయాణ ఖర్చులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో నెలకు వారిపై రూ. రెండు వేల వరకు అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలతో వారు కుటుంబాలను ఎలా నెట్టుకు రావాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి కనీస వేతనం రూ.26వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమ్మాజీ, కుమారి, పద్మ, రమణమ్మ, లక్ష్మీశ్యామల, రామలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం ల్యాండ్ పూలింగ్ రైతుల వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

లంకెలపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పరవాడ మండలం పెదముషిడివాడలోని ల్యాండ్ పూలింగ్ రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాకఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్న ఇళ్ల పట్టాల కోసం గత ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా తమ నుంచి సుమారు 200 ఎకరాల డి.పట్టా భూములను సేకరించిందన్నారు. నష్ట పరిహారంగా లేఅవుట్ వేసి రైతుందరికీ ఇంటి స్థలాలను కేటాయించి రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారన్నారు. సుమారు రెండేళ్లు గడుస్తున్నా తమకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని ఈ కారణంగా 150 మంది రైతులం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై అధికారులను కలిసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. తమకు నష్ట పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంధం వెంకటరమణ, ఒమ్మి వెంకటరావు, నారపిన్ని సంతోశ్‌కుమార్, రావాడ నాయుడు, కనకనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పుస్తకాల పంపిణీ



హిందీ పుస్తకాలు అందజేస్తున్న కూటమి నాయకులు

కొత్తూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం హిందీ పుస్తకాలను పంపిణీ చేశారు. ఇటీవల ఇక్కడ జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో తమ పిల్లలకు హిందీ బోధన చేయాలని పలువురు తల్లిదండ్రులు కోరారు. దీంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు హిందీ బోధనకు సంబంధించిన పుస్తకాలను జనసేన పార్టీ నాయకులు తాడి రామకృష్ణ, శాంతికుమారిలు తమ సొంత నిధులతో సమకూర్చారు. వీటిని ఎంఈవో శ్రీదేవి, హెచ్ఎం ఉమామహేష్ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 82వ వార్డు కన్వీనర్ ఆళ్ల రామచంద్రరావు, కూటమి నాయకులు పోలారపు త్రినాథ్, అప్పికొండ గణేశ్, రాము, నానాజీ, లక్ష్మణరావు, సత్య, అయ్యప్ప, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం'



మహిళకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడం లేదని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. 81వ వార్డు గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో బుధవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. పలువురి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనుకున్న మేరకు నవరత్నాల పేరుతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామన్నారు. నాయకులు బొడ్డేడ శివ, కేఎం నాయుడు, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను!

▸▸ ఎరుకునాయుడుపాలెంలో వీఎంఆర్‌డీఏ లే-అవుట్‌లలో ఖాళీగా ఉంచిన భూములను ప్లాట్లుగా విభజించి విక్రయాలు

▸▸ ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు ▸▸ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని పలువురు వేడుకోలు



ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ వీఎంఆర్‌డీఏ లే-అవుట్‌లో ఆక్రమణలకు గురవుతున్న ఖాళీ స్థలం

సబ్బవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు గ్రామాల పరిధిలో గత ప్రభుత్వంలో వీఎంఆర్‌డీఏ ఏర్పాటు చేసిన మెగా లే-అవుట్‌లలో ప్రజల అవసరాల కోసం ఉంచిన పలు ఖాళీ స్థలాలపై అక్రమార్కులు కన్నేశారు. వాటిని ప్లాట్లుగా విభజించి విక్రయించు కుంటున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ అంశంపై సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు కూడా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఎరుకునాయుడుపాలెం, పైడివాడ, పి.అగ్రహారం గ్రామాల్లో వీఎంఆర్‌డీఏ అధికారులు 2021లో పేదలకు గృహ నిర్మాణ పథకంలో భాగంగా 320 ఎకరాల్లో మెగా లే-అవుట్ ఏర్పాటు చేశారు. ఇందులో 233 ఎకరాల్లో సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారు. 87.83 ఎకరాలు అభివృద్ధి చేసి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద ప్లాట్లు ఇచ్చారు. ఆమ్నెటీస్, యుటిలిటీస్ ఏరిగా 7.03 ఎకరాలు, ముఖ్య అవసరాలు (ఓపెన్ స్పేస్ ఏరియా) కోసం 23.4 ఎకరాల భూమిని లే-అవుట్‌లలో వివిధ చోట్లు మూడు గ్రామాల రెవెన్యూ పరిధిలో ఖాళీగా ఉంచారు. ఈ ఖాళీ స్థలాలపై కొంత మంది అక్రమార్కులు కన్నేశారు. వీటిని ఎలాగైనా కొట్టెయ్యాలన్న ఉద్దేశ్యంతో ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 73, 75లలో ఒకేచోట ఖాళీగా ఉంచిన 97 సెంట్ల స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ గజం స్థలం రూ.10 వేల నుంచి 15 వేల వరకూ పలుకుతోంది. ఆక్రమణకు గురవుతున్న వీఎంఆర్‌డీఏ స్థలం రూ. ఐదు కోట్ల నుంచి రూ.ఏడు కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ ఆక్రమణలపై అదే గ్రామానికి చెందిన మొల్లి నవనీత వర్మ అనే వ్యక్తి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక వేదికలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు కూడా చేశారు. రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నెలాఖరుకు నూకాంబిక ఆలయ పునర్నిర్మాణం పూర్తి

▸▸ అధికారులకు ఎమ్మెల్యే కొణతాల ఆదేశం ▸▸ పనులను పరిశీలించి పలు సూచనలు ▸▸ తొలుత అమ్మవారికి పూజలు



ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు తొలుత ఈవో కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్మాణ పనులను పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరునాటికి ఆలయ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ప్రత్యేక దినాల్లో కుంకుమ పూజలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మాజీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ సేవలు అభినందనీయం

▸▸ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆర్డీవో షేక్ ఆయీషా



ఆర్డీవోను సత్కరిస్తున్న సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజెన్స్ సేవలు అభినందనీయమని ఆర్డీవో షేక్ ఆయీషా అన్నారు. ఇక్కడి జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం ఏర్పాటైన సీనియర్ సిటిజెన్స్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. సీనియర్ సిటిజెన్స్‌కు ఒంటరితనాన్ని పొగొట్టి అందరితో కలిసి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి మాట్లాడుతూ రైల్వే రాయితీ గురించి త్వరలో మంచి వార్త వింటామన్నారు. జిల్లా అధ్యక్షులు కేవీ గౌరీపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ సత్యకుమార్, మహారాజ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

▸▸ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సబ్బవరపు గణేశ్

సబ్బవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ అన్నారు. ఇక్కడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. మౌలిక సదుపాయాలు, విద్యాలయంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయలతో మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా పాఠాలు బోధించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో మేలు

▸▸ వారోత్సవాల్లో వక్తలు ▸▸ మొగలిపురంలో అవగాహన ర్యాలీ



బాలామృతం అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న



మొగలిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థినులు

పరవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రావాడ పంచాయతీ శృంగారపాడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన బాలామృతం, గుడ్లు, బెల్లం, చెక్కీలను గర్భిణులు, బాలింతలకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటూరు వీరునాయుడు, మొల్లి అప్పలరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో వి.లలితకుమారి అన్నారు. మండలంలోని మొగలిపురంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవిగా పేర్కొన్నారు. అనంతరం సత్యం కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. సర్పంచ్ గండి అరుణ, సూపర్ వైజర్ వై.ఇందిరా, కార్యదర్శి రజిని, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, గండి సత్యం, వెన్నల శంకరరావు, రాంబాబు, శ్రీను, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు/ కశింకోట: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అనకాపల్లి కశింకోట మండలాల్లో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు అందించాలన్నారు. తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని వివరించారు.

పీ-4 విజయవంతం అందరి బాధ్యత

▸▸ అధికారుల సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి రమామణి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి రమామణి

సబ్బవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి రమామణి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 కార్యక్రమ ప్రగతిపై కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మండలంలో గుర్తించిన బంగారు కుటుంబాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 24 పంచాయతీల్లో సర్వే నిర్వహించి 3550 కుటుంబాలను గుర్తించి, 1808 కుటుంబాలను అర్హులుగా నిర్ధారించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకూ 1252 కుటుంబాలకు మార్గదర్శిలను మ్యాపింగ్ చేసినట్టు చెప్పారు. దీనిపై ప్రత్యేకాధికారిణి మాట్లాడుతూ గ్రామాల్లో స్థితిమంతులు, విద్యావంతులు, రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి మిగతా కుటుంబాలకు మార్గదర్శిలను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఆర్థికంగానే కాకుండా మాటసాయం చేసేవారు, మోరల్ సపోర్టు అందించేవారు, జీవితంలో ఎదిగేందుకు మంచి సలహాలు సూచనలు ఇచ్చేవారిని కూడా మార్గదర్శిలుగా గుర్తించాలని ఆమె వివరించారు. ఈ ప్రక్రియను త్వరిగతిన పూర్తిచేసి నివేదిక పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ డిచైతన్య, పలువురు కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

ఉత్సాహంగా జిల్లాస్థాయి విలువిద్య, బాక్సింగ్ ఎంపిక పోటీలు



విలువిద్య పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పరవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి విలువిద్య, బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి జిల్లాల తరపున తలపడతారని జిల్లా ప్రాధికార సంస్థ చైర్మన్ ఎల్‌వీ రమణ తెలిపారు. తొలుత పోటీలను గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ప్రారంభించారు. పాఠశాల సీఈవో కె.నిశాంత్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యాశక్తి'ని బహిష్కరిస్తున్నాం

▸▸ ఫ్యాప్టో చైర్మన్ చిన్నారావు



సూపరింటెండెంట్‌కు వినతిని అందిస్తున్న ప్రతిధులు

అనకాపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు తెలిపారు. కొప్పాకలో గల డీఈవో కార్యాలయానికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తరలివచ్చి సూపరింటెండెంట్ పార్వతికి విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ విద్యాశక్తి కార్యక్రమం వలన హైస్కూల్‌లో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఆన్‌లైన్ ప్రచారంలో క్వాలిటీ లేకపోవడం, బోధన అంతా తెలుగు మీడియంలో జరగడంతో పాటు విద్యుత్ లేని సమయంలో విద్యాశక్తి కార్యక్రమం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ గొంది చినబ్బాయి, తదితరులు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దిన జనపాల అప్పలనాయుడు కుటుంబానికి ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ఇక్కడ తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులంతా తమ ఒకరోజు వేతనాన్ని రూ.మూడు లక్షల 78వేల 430లను సమకూర్చడంతో మృతుడు భార్య సత్యవతికి ఈ నగదును ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి హోంగార్డులు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ టి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వేణుగోపాలస్వామి ఆలయ భూములు కౌలు వేలం



ఆలయ భూములను పరిశీలిస్తున్న సుధారాణి

కశింకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తిలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ భూములకు కౌలు నిమిత్తం త్వరలో వేలం పాట నిర్వహించనున్నామని దేవదాయ శాఖ అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కవిటపు లక్ష్మీ సుధారాణి తెలిపారు. బుధవారం సదరు ఆలయ భూములను ఆమె పరిశీలించారు. గత 29న గ్రామస్థులకు, రైతులకు ఎటువంటి సమాచారం లేకుండా సత్యనారాయణస్వామి దేవస్థానం ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి ఇక్కడ వేలం పాట నిర్వహించాలని ప్రయత్నించడం, పలువురు అడ్డుకోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీనిపై పలువురు గ్రామస్థులు దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె భూములను పరిశీలించారు. వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి 7.54 ఎకరాల భూముల కౌలు వేలం పాట తేదీని త్వరలో ఖరారు చేసి, గ్రామంలో దండోరా వేయించాలని ఈవో ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తిని ఆమె ఆదేశించారు.



గన్నెల ప్రాథమిక పాఠశాలలో పనిచేయని ఆర్వోప్లాంట్



విరిగిపోయిన కుళాయి పాయింట్స్

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

» ప్రాథమిక పాఠశాలల్లో నిరుపయోగం

» విద్యార్థులకు అందని సురక్షిత తాగునీరు

అరకులోయ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంట్‌లు నిరుపయోగంగా పడిఉన్నాయి. దీంతో విద్యార్థులకు సురక్షిత జలం అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసి ఈ ఆర్వో ప్లాంట్‌లు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. ఇందుకు ఉదాహరణగా గన్నెల ప్రాథమిక పాఠశాలతోపాటు ఇతరచోట్ల ఉన్న ఆర్వో ప్లాంట్లు నిలుస్తున్నాయి. తరగతి గదుల్లో వీటికి సంబంధించి పరికరాలు నిరుపయోగంగా వదిలేశారు. వీటిని పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. ఈ విషయంలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. గన్నెల పాఠశాలలో ఏర్పాటుచేసిన కుళాయి పాయింట్స్ ఒక్కటీ పనిచేయడంలేదు. విరిగిన కుళాయిల నుంచి వచ్చే నీటిని విద్యార్థులు ఫ్లాట్‌ఫారాలపైకి వెళ్లి పట్టుకుంటున్నారు. మధ్యాహ్న భోజనాల అనంతరం చేతులు, కంచాలు కడుక్కునేందుకు అవస్థలు పడుతున్నారు. టాయ్‌లెట్స్‌లో రన్నింగ్‌వాటర్ రావడం లేదు, ట్యాంకు వైపు ఉన్న వాల్ విప్పితేనే నీరు వస్తోంది. బాత్‌రూమ్ లకు పాఠశాల తరగతులు జరిగినంతసేపు రన్నింగ్ వాటర్ వచ్చే ఏర్పాటు చేయలేదు. పాఠశాలలో పనిచేసే వర్కర్లు పిల్లలు బాత్‌రూమ్స్, టాయలెట్స్‌కు వెళ్లే సమయంలో మాత్రం నీటిని విడిచిపెడుతున్నారు.

ఫర్నీచర్, టీవీ, డిజిటల్ బోర్డులు పనితీరు అంతంతమాత్రమే..

నాడు-నేడు పథకంలో పాఠశాలలో ఏర్పాటు చేసి ఆర్వోప్లాంట్స్, ఫర్నీచర్, టీవీ, డిజిటల్ బోర్డులు పూర్తిస్థాయిలో ఉపయోగంలోలేవు. వీటన్నిటిపైనా సమగ్ర విచారణ జరిపితే వాటర్‌ప్లాంట్ల పనితీరు, ఇతర విద్యాబోధనకు అవసరమయ్యే మెటీరియల్ ఏ మేరకు పాఠశాలల్లో ఉపయోగపడుతున్నాయో బహిర్గమవుతోందని పలువురు డిమాండ్‌చేస్తున్నారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖఅధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలలని విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు వసతులు మెరుగుపరిచేందుకు వీలుగా చూడాలని కోరుతున్నారు.



కొళాయి ఫ్లాట్‌ఫారంపైకి వెళ్లి నీటిని పడుతున్న చిన్నారి



నీరు రాక మూలకు చేరిన టాయ్‌లెట్స్

'ఆశ్రమ' విద్యార్థిని మృతిపై విచారణ

» చిన్నారి స్వ గ్రామమైన కినపర్తిలో ప్రత్యేక వైద్యశిబిరం

కొయ్యూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని జ్వరంతో మృతి చెందడంపై జిల్లా మలేరియా అధికారి తులసి విచారణ చేపట్టారు. ఈ నెల 4వతేదీన ఈ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని పొట్టిక నీలవేణి జ్వరంతో మృతి చెందింది. 5తేదీన 'ఆంధ్రజ్యోతి' 'అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి' శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ ఈ ఉదంతంపై నివేదిక ఇవ్వాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆ అధికారి రవణాపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినికి ఎప్పుడు జ్వరం వచ్చింది? పాఠశాలలో ఇంకా విద్యార్థులు ఇంకా వేరెవరైనా జ్వరంతో బాధపడుతున్నారా? అని పరిశీలించారు. అనంతరం రాజేంద్రపాలెం పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసుల రికార్డులను పరిశీలించారు. బాలికమృతి చెందిన కినపర్తి ఆమె వెళ్లారు. ఈ మృతిపై కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇంకా ఎవరైనా మలేరియా బాధపడుతున్నారా అని ఆరా తీశారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ వ్యాధి సోకిన వెంటనే పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందాలన్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే, రాజేంద్రపాలెం వైద్యాధికారి హేమంత్ ప్రత్యేక గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, సీహెచ్‌వో ప్రశాంత్ కుమార్, వైద్యశిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థి కుటుంబ సభ్యులు,గ్రామస్థులతో మాట్లాడుతున్న మలేరియా అధికారి

కరాటేలో ఆశ్రమ విద్యార్థినుల ప్రతిభ



మాకవరంలో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొయ్యూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. మాకవరం, రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు జిల్లా స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ చూపి పతకాల పంట పండించారు. విశాఖపట్నం యారాడ బీచ్‌లో జరిగిన ఈ పోటీల్లో మాకవరానికి చెందిన కొర్రా గాయత్రి కాటా ఈవెంట్(ఏ)లో బంగారు, కాటా ఈవెంట్ (బి)లో వెండి పథకం సాధించింది. రాజేంద్రపాలెం ఆశ్రమానికి చెందిన తన్విత, వినీత, సింధు, సమీర ఈ పోటీలలో ప్రథమ స్థానాలలో నిలిచి పతకాలు సాధించారు. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంధ్య, గోపాల్‌లతో పాటు సిబ్బంది, విద్యార్థులు బుధవారం అభినందించి ధ్రువపత్రాలందించారు.

వేతనాలు అందక ఆస్పత్రి కార్మికుల అవస్థలు

» వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రాజుబాబు

పాడేరురూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ గార్డులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) అల్లూరి జిల్లా కన్వీనర్ జల్లి రాజు బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు చెందిన పీఎఫ్ డబ్బు చెల్లించకుండా కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఈ సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం ఉండటంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వాసుపత్రిలో థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే చలో విజయవాడకు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్, ఆస్పత్రి కార్మికులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు మెరుగైన చికిత్స: డీపీఎంవో



పెదవలస పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న డీపీఎంవో కిరణ్‌కుమార్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో క్షయ రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు డీపీఎంవో ఎన్‌హెచ్‌ఎం, జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన పెదవలస పీహెచ్‌సీని సందర్శించారు. క్షయ రోగులకు అందుతున్న వైద్యం, వైద్య పరీక్షలు, ఇతర రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎంవో మాట్లాడుతూ క్షయకు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందన్నారు. వారం రోజులకు మించి దగ్గు, జ్వరం ఉంటే బాధితులు కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. క్షయ యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ క్షయ రోగులకు అందుతున్న చికిత్సను పరిశీలించాలన్నారు. స్థానిక ఆశ, సీహెచ్‌వోల ద్వారా రోగులు క్రమంగా మందులు వేసుకునేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శిబిరాల ద్వారా గ్రామాల్లో క్షయ రోగులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పృథ్వీష, చందన్ కుమార్, ఎస్టీఎస్ అశోక్ కుమార్, ఎస్టీఎల్ఎస్ ఏవీఏ రావు పాల్గొన్నారు.

రికార్డులు, హెల్మెట్ లేని వాహనచోదకులపై కేసులు



చింతపల్లిలో వాహన రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ డివిజన్ కేంద్రం జాతీయ రహదారి వద్ద పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేయడంతోపాటురికార్డులను పరిశీలించారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సూరెన్సులేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి ప్రయాణిస్తున్న వాహనాల డ్రైవర్లకు హెచ్చరించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్‌బాబు మాట్లాడుతూ ద్విచక్రవాహనాల రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనాలు నడిపే వ్యక్తులకు డ్రైవింగ్ లైసెన్సు, ఇతర రికార్డు సక్రమంగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సేంద్రియ సాగు మేలు: ఏడీఏ




ఘన, ద్రవ జీవామృతాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు (ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. బుధవారం అంతర్ల గ్రామంలో రైతు సదస్సు వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన ప్రాంతానికి ఆర్గానిక్ హబ్‌గా ప్రకటించిందన్నారు. రైతులంతా సేంద్రియ పద్ధతిలోనే పంటలను పండించాలన్నారు. అనంతరం ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీని ఏడీఏ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు, కూటమి నాయకులు వంతల బుజ్జిబాబు, నాగభూషణం, రీమల ఆనంద్, అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

పెదగూడ ఆరోగ్య ఉప కేంద్రానికి తాళం

» ఉపాధి కల్పిస్తామన్న హామీ నిలపాలని స్థల దాత నిరసన



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి తాళం వేసిన స్థల దాత రామ్‌కుమార్

ముంచంగిపుట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పెదగూడ పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన టి. రామ్‌కుమార్ బుధవారం ఈ కార్యాలయాలకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీల నిర్మాణానికి 2015లో దాదాపు 6 సెంట్ల స్థలాన్ని ఇచ్చానన్నారు. ఇలా, స్థలాన్ని ఇస్తే తనకు ఉపాధి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. నేటికి పదేళ్లవుతున్నా వారి మాటలు కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కానరావడంలేదని వాపోయాడు. తాళం వేయడంతో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది బయటనే ఉండి పోయారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు గణపతి రాజ్‌కుమార్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

'గిరిజన సంక్షేమ శాఖ డీడీగా రెగ్యులర్ అధికారిని నియమించాలి'

పాడేరురూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాడేరు గిరిజన సంక్షేమ శాఖ (విద్య) డిప్యూటీ డైరెక్టర్‌గా రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి లేఖను రాసినట్టు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పాంగి రాజారావు బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. గత విద్యా సంవత్సరం (2024- 25)లో డీడీగా విధులు నిర్వహించిన అధికారిని గిరిజన సంక్షేమ శాఖకు సరెండర్ చేసి పాడేరు ఏటీడబ్ల్యూవోగా విధులు నిర్వహిస్తున్న ఎల్.రజనీకి ఎఫ్ఏసీ డీడీగా నియమించారన్నారు.ఆమె ఏడాదిపాటు విదులు నిర్వహించి ఇటీవల జరిగిన రెగ్యులర్ బదిలీల్లో మన్యం జిల్లాకు వెళ్లి పోయారు. ప్రస్తుతం ఆమె స్థానంలో కొయ్యూరు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌ను ఎఫ్ఏసీ డీడీగా నియమించడం సమంజసం కాదన్నారు. గతంలో పూర్తిస్థాయి డీడీ పోస్టులో సబ్ కలెక్టర్, లేదా గూప్-1 అధికారులకు ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చేవారన్నారు.జిల్లాలో కలెక్టర్, ఐటీడీఏ పీవో తర్వాత అత్యంత ప్రాధాన్యతగల డీడీ పోస్టును ఏటీడబ్ల్యూలకు అప్పగించడంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహాల్లో పరిస్థితి దెబ్బతింటుందన్నారు. ఈ విషయంపై తక్షణమే స్పందించి రెగ్యులర్ డీడీని నియమించాలని కోరామన్నారు. ఈ కాపీలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ అమరావతి, జిల్లా కలెక్టర్ పాడేరు, ఐటీడీఏ పీవో పాడేరు పంపించినట్టు ఆయన పేర్కొన్నారు.

అంతాడ రహదారికి మరమ్మతులు చేపట్టాలి: సీపీఐ

కొయ్యూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాత కృష్ణాదేవి పేట నుంచి అంతాడ వెళ్లే ప్రధాన రహదారికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. అంతాడ, బంగారమ్మపేట పంచాయతీల పరిధి పరదేశిపాకలు, కొత్తవీధి, బంగారమ్మపేట, రాజుపేట, బలుసుకూరపాకలు అంతాడలను కలిపే ప్రధాన రహదారి.. పాత కృష్ణాదేవిపేట నుంచి అంతాడ వరకు క నీ సం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు వీలుకాని రీతిలో శిథిలమైందన్నారు. అలాగే, అంతాడ నుంచి కొండపై గల ఎదుమామిడి, రాతిమామిడి, శింగదార, గంపరాయి, డేకురాయి, గరడ, దోమలగొంది, టెంకలపణుకులు, పారికెలు తదితర మరో మూడుగ్రామాలకు కనీస రహదారి సౌకర్యం లేక అంతాడ వరకు ఆ గ్రామాల ప్రజలు రవాణాకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో డోలీమోతలే దిక్కవుతున్నాయ న్నారు. ఈస్థితిలో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని సత్యనారాయణ కోరారు.

10న ఏపీజీఈఏ చింతపల్లి తాలూకా ఎన్నిక

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ కేంద్రంలో చింతపల్లి తాలూకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి డీవీఎస్ఎన్ రాజు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బలంగా పనిచేస్తోందన్నారు. ఈ సంఘం సభ్యుల సమావేశంతోపాటూ అదే రోజు తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక చేపడతామన్నారు. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల పరిధి సభ్యులంతా హాజరుకావాలన్నారు. ఎన్నికల పరిశీలకులుగా విశాఖపట్నం జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు వ్యవహరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సంఘం విశాఖపట్నం ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం

అనంతగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రైతులు, ప్రజలు, వార్డుసభ్యులు గ్రామసభ నిర్వహించారు. హైడ్రో ప్రాజెక్టు వద్దంటూ ఏకాభిప్రాయంతో తీర్మానం చేశారు. పచ్చని పంటపొలాలు, కొండలను ధ్వంసం చేయొద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం తీర్మానాన్ని తహశీల్దార్, ఎస్ఐకు అందించాలని పంచాయతీ కార్యదర్శిని గిరిజనులు, సర్పంచ్ అప్పారావు కోరారు.

పిల్లల సంరక్షణపై అవగాహన అవసరం

» డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావునాయుడు



బాలల స్వాస్థ్య కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావు

పాడేరురూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకం, సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరరావునాయుడు సూచించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్ వైజర్లకు బుధవారం ఒకరోజు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, ఆహారం, ఆటలతో అభివృద్ధి, సంరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కీలకమన్నారు. ఆరు నెలలకు ఒకసారి ప్రతీ అంగన్ కేంద్రంలో పిల్లలకు స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు. అనారోగ్యంతో ఇబ్బందిపడే చిన్నారులను గుర్తించి పాడేరు జీజీహెచ్‌లోని డీఈఐసీ సెంటర్‌కు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (హైదరాబాద్) వైద్యుడు కిరణ్, ఏడీఎంహెచ్‌వో, జిల్లా ప్రోగ్రాం అధికారి టీఎస్ ప్రతాప్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు జెకైలాశ్, డాక్టర్లు ఎస్. గ్రీష్మ, వై.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు బైక్ మెకానిక్ సర్టిఫికెట్ కోర్సు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ భారతి, ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బైక్ మెకానిక్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. బుధవారం కళాశాలలో ప్రారంభించిన 45రోజుల కాలపరిమితితో ఈ కోర్సును స్థానిక ఎస్ఐ ఎం. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువతను స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించేందుకు ఉన్నత విద్యామండలి కళాశాల ద్వారా బైక్ మెకానిక్ సర్టిఫికేట్ కోర్సును అందిస్తుందన్నారు. రోజుకి గంట పాటు శిక్షణ ఉంటుందని, 100మంది యువకులకు అవకాశం ఉందన్నారు. గిరిజన ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు బ్యాంక్ రుణం పొంది స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి జగ్గత్‌రాయ్, అధ్యాపకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి: డీసీహెచ్‌ఎస్



సీహెచ్‌సీలో రోగుల భోజనాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ముంచంగిపుట్టు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలం దించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ నీలవేణి అన్నారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం సీహెచ్‌సీలో ఉన్న మందులు, నమోదవుతున్న మలేరియా, టైఫాయిడ్, ఇతర రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉండాలని వైద్యులకు సూచించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు అందించే భోజనాలను పరిశీలించారు. మధ్యాహ్నం 1 గంటలకు రోగులకు భోజనాలు అందించడంపై నిర్వాహకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం వైద్యులతో ఆమె సమావేశమయ్యారు. మందులు కొరత లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం వ్యాధులు సీజన్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌సీలో గైనకాలజిస్టును నియమించాలని గిరిజన సంఘం నేతలు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీనులు నీలవేణికి వినతిపత్రం అం దించారు.

బీజేపీ నేత బొజ్జయ్య సేవలు చిరస్మరణీయం



బొజ్జయ్యకు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు, కుటుంబ సభ్యులు

పాడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో భారతీయ జనతా పార్టీ బలోపేతంలో దివంగత నేత కురసా బొజ్జయ్య చేసిన కృషి మరవలేమని బీజేపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌ఛార్జి పుట్టా గంగయ్య అన్నారు. బొజ్జయ్య ఆరో వర్ధంతి పురస్కరించుకుని స్థానిక కొత్తపాడేరులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతానికి బీజేపీని పరిచయం చేయడంతోపాటు పార్టీని విస్తరించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ఆయనకు చక్కని గుర్తింపుగా అనేక పదవులను ఇచ్చారన్నారు. అలాగే బీజేపీ అగ్రనేతలు వెంకయ్యనాయుడు, అద్వానీ, హరిబాబు తదితరులతో పార్టీలో పని చేశారు. ఆయన స్ఫూర్తితోనే మన్యంలో నేతలు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని గంగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కురసా ఉమామహేశ్వరరావు, నేతలు కురసా రాజారావు, నందోలి ఉమామహేశ్వరరావు, గోపాలపాత్రుడు, లకే అబ్బా యిదొర, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురసా పార్వతమ్మ, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



తలపడుతున్న సీలేరు-విజయనగరం క్రీడాకారులు

సీలేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ సర్కిల్ కబడ్డీ పోటీలు రెండో రోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. సీలేరు జట్టు క్వార్టర్ ఫైనల్‌కి అర్హత సాధించింది. సాయంత్రం ఐదు గంటలకు 11 జట్ల మధ్య పోటీలు జరిగాయి. తొలుత క్రీడాకారులు ఈఈ రాజేంద్ర ప్రసాద్, నాగ శ్రీనివాసరావును కరచాలనం చేసి అనంతరం పోటీల్లో పాల్గొన్నారు. ఇంటర్ సర్కిల్ కబడ్డీ స్పోర్ట్స్ కౌన్సెల్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏవో శ్రీనివాస్ సేవలు అభినందనీయం

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లపాటు మండల వ్యవసాయ అధికారిగా సేవలందించిన బి. శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని ఏడీఏ బీవీ తిరుమలరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా రేగడి ఆమదాలవలస బదిలీపై వెళ్లిన ఏవో శ్రీనివాసరావుని వ్యవసాయశాఖ ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ శ్రీనివాసరావు స్థానిక నివాసం ఉంటూ గిరిజన ప్రాంత రైతుల ప్రగతికి ప్రత్యేక కృషి చేశారన్నారు. నూతన యాజమాన్య పద్ధతులపై సూచనందజేస్తూ ఆదివాసీల మన్ననలు పొందారన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏవో మధుసూదనరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

పాడేరురూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగిశపల్లి పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సభను నిర్వహించి ఘనంగా సన్మానించారు. లగిశపల్లి పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు మఠం ప్రసాద్ పడాల్,మేడపల్లి గురునాథ్‌లను పాఠశాల హెచ్‌ఎం కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్. రామకృష్ణపాత్రుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ అ య్యప్ప, వైస్ ఛైర్మన్ జయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమేశ్, రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మహేశ్వరరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిలకలగెడ్డ ఆశ్రమ పాఠశాలలో..

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలనుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కె. గాశీ, ఎన్ఆర్. అమర్నాథ్‌ను హెచ్‌ఎం సైమన్, తోటి ఉపాధ్యాయులతో కలిసి బుధవారం సన్మానించారు. అలాగే, పాఠశాలకు బదిలీపై వచ్చిన శెట్టి.రాంబాబు, ఎస్‌వీవీఎల్ఎస్. గుప్తా, కె. రాంబాబు, జి.కన్యాకుమారి, బి.బి. రంభమణిలను సత్కరించారు. సమన్వయంతో పని చేసి పాఠశాల, విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని హెచ్‌ఎం సైమన్ ఈ సందర్భంగా కోరారు.



చిలకలపాలెంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గాశీ,అమర్నాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయుల వీడ్కోలు సభలో మాట్లాడుతున్న హెచ్‌ఎం కొండబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని 26 వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఇద్దరు లబ్ధిదారులకు బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. మాకవరపాలెం మండలం చిన రాచపల్లి గ్రామానికి చెందిన చింతల చెల్లయ్యనాయుడు భార్య సాయికి రూ.2.65 లక్షలు, బూరుగుపాలెం గ్రామానికి చెందిన కేతిరెడ్డి చిన్నతల్లికి రూ.47097 చెక్కులను అందించారు.

స్కూల్ బస్సులకు లేబర్ లైసెన్స్ తప్పనిసరి

» సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ


స్కూల్ బస్సుల యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

చోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సులకు లేబర్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్థానిక సహాయ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు, బస్సుల డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుకు లేబర్ లైసెన్సుతో పాటు రోజుకి ఎనిమిది గంటలు పని అమలుచేయాలని సూచించారు. ప్రతీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రైవేటు స్కూళ్ల యజమానులు, బస్సుల డ్రైవర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 57 మంది ఎంపిక


నిరుద్యోగులను ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏబీఎం డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు 57 మంది ఎంపికయ్యారని కరస్పాండెంట్ అకంరెడ్డి గిరిబాబు తెలిపారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ మేళాలో 162 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా, ఇంటర్వ్యూలో 57 మందిని ఎంపిక చేశారు. డక్కన్ సిమ్మెంట్స్, డైకిన్, కాల్గేట్, ఎస్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఇన్నోవ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు


దేవరాపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. చింతలపూడి పంచాయతీ కోరాడ గ్రామంలో మంగళవారం రాత్రి బిల్లులకు నిప్పు పెట్టి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లు, దుకాణాలకు బిగించి భారీ బిల్లులతో షాక్ ఇస్తున్నారన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై తీవ్ర భారం మోపడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జన్ని దేముడు, ఎర్నాయుడు, ఈశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పసలీ బీమా పథకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఎల్‌వై.కాంతమ్మ సూచించారు. మండలంలోని దేవరాపల్లి, చేనులపాలెం గ్రామాల్లో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఈ పథకం కోసం అక్టోబరు 15వ తేదీలోగా ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. తుఫానులు, కరువు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కలిగే నష్టాలకు ఈ బీమా పథకం ద్వారా రైతులకు పరిహారం అందుతుందని చెప్పారు. అలాగే బ్యాంకుల్లో రుణాలు తీసుకోకుండా ఉన్న రైతులు పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఇందుకోసం పోస్టాఫీసులు, కామన్ సర్వీస్ సెంటర్, గ్రామ సచివాలయాలను సంప్రదించాలని ఆమె సూచించారు.

మోస్తరు వర్షం


ఏఎల్.పురం కురుస్తున్న వర్షం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం పడింది. కృష్ణాదేవిపేట, ఏఎల్.పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో వాన కురిసింది. రెండు రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు, ఈ వర్షం కొంతమేరకు ఉపశమనం కల్పించింది. ఈ వర్షంతో వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బలిఘట్టం కల్యాణ మండపానికి మోక్షం

సత్యనారాయణస్వామి మండపానికి రూ.70 లక్షలు మంజూరు

» టీడీపీ హయాంలో రూ.75 లక్షలతో పనులు ప్రారంభం
» నిధులు సరిపడక మధ్యలో నిలిచిపోయిన నిర్మాణం
» గత ఐదేళ్లూ కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
» ఆరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణం
» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో వీఎంఆర్‌డీఏ నిధులు మంజూరు


సత్యనారాయణస్వామి ఆలయం సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపం ఇదే...

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న కల్యాణ మండపానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిన నిర్మాణ పనులు, త్వరలో ప్రారంభం కానున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.75 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభించి, రూఫ్ లెవల్ వరకు పూర్తి చేశారు. కల్యాణ మండపంలో వెయ్యి మంది పట్టే విధంగా విశాలవంతమైన హాలు, రెండు గదులు, మరుగుదొడ్లు నిర్మాణం చేయాలని ప్రణాళిక చేశారు. అంచనాలకు మించి ఖర్చు కావడంతో రూఫ్ స్థాయి వరకు పనులు చేపట్టారు. అక్కడికతో మొత్తం నిధులు ఖర్చయ్యాయి. నిధులు సరిపోకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయలేదు. గత ఐదేళ్ల పాలనలో ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో...

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ కల్యాణ మండపంపై ప్రత్యేక దృష్టిసారించారు. మండపం పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈఈతో అంచనాలు తయారు చేశారు. కల్యాణ మండపం పై కప్పు, రెండు గదులు, మరుగుదొడ్లు, ఏసీ, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్ టైల్స్, సీలింగ్ పనులకు రూ.1.25 కోట్లు ఖర్చవుతుందని అంచనాల నివేదికను ఇచ్చారు. దీంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకుని వీఎంఆర్డీఏ నుంచి రూ.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో త్వరలో టెండరు ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు

» ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు


రెవెన్యూ కాంప్లెక్స్ భవనాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం చోడవరంలోని నాలుగు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు ఏర్పాటు కానున్నదని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న రెవెన్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. రెవెన్యూ కాంప్లెక్స్‌లో దిగువ భాగంలో రెవెన్యూ కార్యాలయానికి, సబ్ ట్రెజరీ కార్యాలయానికి కేటాయించిన గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాంప్లెక్స్ పై భాగంలో వీడియో కాన్ఫరెన్స్‌కు, వివిధ శాఖల శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న హాలులో అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పించాలని మండల ఇంజినీరింగ్ అధికారి శాంతారాంకు సూచించారు. సబ్ ట్రెజరీ కార్యాలయానికి కేటాయించిన బ్లాకులో సిబ్బందికి, రికార్డులు భద్రపరిచేందుకు అవసరమైన విధంగా కార్యాలయాన్ని మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ ట్రెజరీ అధికారి మీనా తమకు ఇచ్చిన బ్లాకులో వెలుతురు మరింతగా వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను కోరగా, ఆ దిశగా మార్పులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలకు కూడా ప్రత్యేకంగా ఒక గది కేటాయించడంతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ గదిని ఉన్నతాధికారులకు గెస్ట్‌హౌస్‌గా ఉంచేందుకు మార్పులు చేయాలని కోరారు. రెవెన్యూ కాంప్లెక్స్ ఆవరణలోనే ఉన్న రెవెన్యూ, సబ్ ట్రెజరీ, పంచాయతీలతో పాటు సబ్ జైలుకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఆవరణలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు.

మూడు నెలల్లో కార్యాలయాలకు భవనాలు

అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, రెవెన్యూ కాంప్లెక్స్ పనులు మూడు నెలల్లోగా పూర్తి చేసి రెవెన్యూ, సబ్ ట్రెజరీ, వెలుగు కార్యాలయాలకు పక్కా భవనాలు సమకూరుస్తామని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మాణం ప్రారంభించిన ఈ భవనాలను వైసీపీ హయాంలో ఐదేళ్లూ పట్టించుకోకుండా వదిలేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కార్యాలయాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గూనూరు మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

నర్సీపట్నం. ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రూ.4 కోట్లతో నాలుగు అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో 151 జీవో జారీ చేసింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏప్రిల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 151 జీవోలో ఇప్పటికే మంజూరు చేసిన నర్సీపట్నం బీసీ కాలనీ రోడ్డు స్థానంలో అసంపూర్తిగా ఉన్న శారదానగర్ రోడ్డు, డ్రైనేజీ పనులు ముందుగా చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న శారదాగనర్ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది. మిగిలిన అభివృద్ధి పనులలో ఎటువంటి మార్పులు చేయలేదు. నాతవరం మండలం గుమ్మిడిగొండ వంతెన దాటిన తర్వాత అధ్వానంగా ఉన్న 400 మీటర్లు రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. చింతపల్లి రోడ్డు నుంచి పాకలపాడు రోడ్డు 1.7 కిలోమీటర్లు అభివృద్ధి, బలిఘట్టం బైపాస్ రోడ్డు వై జంక్షన్ నుంచి జోగినాథునిపాలెం గ్రామంలో ఒక కిలోమీటరు సీసీ రోడ్డు అభివృద్ధి చేయన్నారు. బలిఘట్టం బైపాస్ రోడ్డులోని శారదానగర్ డ్రైనేజీ, రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

క్రీడాకారుల కోటా అభ్యర్థుల ఎంపికపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» జాతీయ స్థాయి క్రీడాకారుడు గణేశ్

చోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి క్రీడాకారుల కోటా అభ్యర్థుల ఎంపికకు శ్వేతపత్రం విడుదల చేయాలని జాతీయ స్థాయి క్రీడాకారుడు పుల్లేటి గణేశ్ డిమాండ్ చేశారు. క్రీడాకారుల కోటాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు అమరావతిలో సర్టిఫికెట్లను పరిశీలిస్తుండడం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేస్తే కనీస స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అభ్యర్థులు అయోమయంలో పడిపోయారన్నారు. అభ్యర్థులకు క్రీడాకారుల కోటాలో అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలి

రావికమతం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీవో సీతారామస్వామి ఆదేశించారు. ఇటీవల గ్రామ సచివాలయాలకు బదిలీపై వచ్చిన సిబ్బందితో బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు, రేషన్ కార్డులో చేర్పులు మార్పులకు, పలు ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు నిర్ణీత సమయంలో అందుబాటులో ఉండి మెరుగైన సేవలను అందించాలన్నారు. పి-4, వర్క్ ఫ్రం హోంల సర్వేలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాధానాలు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు.

'సత్యనారాయణ సేవలు మరవలేం'

నాతవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లింగంపేట టీడీపీ నాయకుడు అల్లు సత్యనారాయణ చేసిన సేవలు మరవలేనివని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ పేర్కొన్నారు. లింగంపేటలో బుధవారం జరిగిన కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ అల్లు సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్ కుమార్, పి.కొండబాబు, వి.సూర్యారావు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

నాతవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు దాతలు సాయం అందించడం అభినందనీయమని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు పేర్కొన్నారు. నాతవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికీ దాత అంకంరెడ్డి గోవింద్ కంచాలు, నీటి సీసాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వారికి చేయూత ఇచ్చినప్పుడే సాయంలో సార్థకత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మృదుబాషిణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగు, ఉపాధ్యాయులు ఎస్.జగన్నాథరావు, పైల వరహాలబాబు పాల్గొన్నారు.

'విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి కష్టాలు'

చీడికాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని జేబీ.పురం పంచాయతీలోని జనం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విలేకరులతో వారు మాట్లాడుతూ జల జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామంలో తాగునీటి కోసం రెండు మోటారు షెడ్లను ఏర్పాటుచేసి తొమ్మిది నెలలు పూర్తయిందన్నారు. ఈ మోటారుకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుచేయాలని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినప్పటికీ, కనీసం స్పందించలేదని వాపోయారు. దీంతో మంచినీటికి గ్రామస్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివారంలోగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయకుంటే సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు మునిసిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. 2025 జూన్ 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అనధికార లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణకు అక్టోబరు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్ నుంచి నేరుగా సిటిజన్ లాగిన్ నుంచి, లైసెన్స్ పొందిన ఎల్‌టీపీల ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించకపోతే విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు సదుపాయం కల్పించేది లేదని స్పష్టం చేశారు. అటువంటి లేఅఅవుట్లు, ప్లాట్లు క్రయవిక్రయాలు కూడా సాధ్యం కాదని ఆయన తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధకశక్తి

నర్సీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ తెలిపారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఐటీసీడీఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ చేతుల మీదుగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పిల్లలకు తల్లిపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం మాతృస్తనపాన గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జీవీరమణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

దేవరాపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తామరబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వీవీ చారిటబుల్ ట్రస్టు బుధవారం సైకిళ్లను పంపిణీ చేసింది. సుమారు 12 కిలోమీటర్ల నుంచి నడుచుకుంటూ తామరబ్బ పాఠశాలకు ఏడుగురు విద్యార్థులు ప్రతి రోజూ వస్తున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు సుభాస్ చంద్రబోస్ ట్రస్టు వ్యవస్థాపకుడు వీవీ.రమణకు సమాచారం అందించారు. దీంతో స్పందించి రూ.6 వేలు విలువ చేసే ఏడు సైకిళ్లను ఒక్కొక్కటి చొప్పున అందజేశారు. సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు గౌరమ్మ, ఉపాధ్యాయులు కొరతం కృష్ణ, గిరిబాబు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ

చోడవరం/దేవరాపల్లి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలనే అంశంపై బాలికలకు శిక్షణ ఇచ్చారు. చోడవరం మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, కొత్తూరు జెడ్‌పీ బాలికల ఉన్నత పాఠశాలలకు ఆత్మరక్షణ విద్య గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని సీఐ బి.అప్పలరాజు ప్రారంభించారు. అలాగే దేవరాపల్లిలో క్యాప్సిల్ కోర్సు ఆన్ సెల్ఫ్ డిఫెన్స్ ఇన్ స్కూల్స్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చోడవరంలో కరాటే మాస్టర్ పి.గణేశ్ ఆధ్వర్యంలో బాలికలకు శిక్షణ ఇచ్చారు. ప్రమాద సమయంలో పాటించాల్సిన మెలకువలు, తమను తాము రక్షించుకు నేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, నాగకార్తీక్, హెచ్ఎం ఉమ పాల్గొన్నారు.

మాడుగుల సమస్యలు పరిష్కరించండి

» టీడీపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మాడుగుల, ఆగష్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతి పత్రం అందించారు. మాడుగుల కేంద్రంలోని గదబూరులో కాలువ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలి ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. వీధి లైట్లు వెలుగులు లేక చిమ్మక చీకటి అల్లుకుంటుందని తెలిపారు. కొబ్బరితోటవీధి, మెదమాంబ కాలనీ, బస్టాండ్ ఏరియాలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, అప్పారావు, కె.మల్లికార్జునుడు, జొన్నపల్లి రమేశ్, గణ పాల్గొన్నారు

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

» రాయితీపై మొక్కలు, ఎరువులు
» జిల్లా ఉద్యావన శాఖాధికారి రహీమ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యావన శాఖాధికారి రహీమ్

గొలుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యావన పంటల సాగు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభు త్వం అనేక రాయితీలు ఇస్తున్నదని జిల్లా ఉద్యావన శాఖాధికారి రహీమ్ అన్నారు. మండలంలోని చిన్నయ్యపాలెంలో బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, ఆయిల్‌పామ్, ఇతర పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం రాయితీపై మొక్కలు, ఎరు వులు అందిస్తున్నదన్నారు. పామాయిల్‌కు గిరాకీ వుండడంతో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తున్నదని, తద్వారా ఆయిల్‌పామ్ తోటల సాగు లాభదాయకంగా వుందని ఆయన తెలిపారు. ఏపీఎంఐపీ అధికారిణి జీవీ లక్ష్మి మాట్లాడుతూ. చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం పరికరాలపై 90 శాతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యావన శాఖ ఏవో శిరీష, స్థానిక నాయకులు చిటికెల సాంబమూర్తి, గొర్లి సత్యనారాయణ, పాల్గొన్నారు.


దీర్ఘకాల వ్యాధులకు హోమియో అద్భుత చికిత్స

సీహెచ్‌సీ హోమియో విభాగాధిపతి డాక్టర్ లత


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ లత

కె.కోటపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాల వ్యాధుల నివారణకు హోమియోలో అద్భుతమైన ఔషధాలు ఉన్నాయని స్థానిక 30 పడకల ఆసుపత్రి హోమియో విభాగాధిపతి డాక్టర్ సుమన్ లత తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఇప్పుడిప్పుడే హోమియో వైద్యంపై అవగాహన పెరుగుతున్నదన్నారు. దీంతో హోమియో వైద్యానికి మంచి ఆదరణ వస్తున్నదన్నారు. గజ్జి, తామర, ఇతర చర్మవ్యాధులు, గ్యాస్ ట్రబుల్, ఆయాసం, గుండె దడ, సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గునియా, చికెన్ ఫాక్స్ వడదెబ్బ తదితర వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా హోమియో మందులు వాడుకోవచ్చునన్నారు. స్థానిక ఆసుపత్రిలో ఒకప్పుడు హోమియోలో ఓపీ అతి తక్కువగా ఉండేదని, ప్రస్తుతం గణనీయంగా రోగులు పెరిగారని ఆమె చెప్పారు. అనేక మంది క్రమం తప్పకుండా హోమియో మందులు వినియోగిస్తున్నారన్నారు. షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచేందుకు కూడా మంచి ఔషధాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో హోమియో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ, జిరాయితీ భూముల హద్దులు గుర్తింపు


ప్రభుత్వ, జిరాయితీ భూముల సరిహద్దు రాళ్లు పాతుతున్న దృశ్యం

మాకవరపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి రెవెన్యూ పరిధిలోని 737 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ, జిరాయితీ భూములకు రెవెన్యూ అధికారులు సరిహద్దులను గుర్తించారు. ఈ సర్వే నంబరులో సుమారు 1600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొంత భూమిని గత 40 ఏళ్లుగా రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఇటీవల జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేయడంతో, ఆ మేరకు నెల రోజులుగా రైతుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసి గుర్తించారు. ప్రస్తుతం సుమారు 430 ఎకరాల భూమి ఉన్నట్టు తేలింది. ఇప్పటికే ఈ భూమిలో రైతులను గుర్తించారు. వారికి పరిహారం ఇచ్చేందుకు జాబితాలను తయారు చేశారు. ప్రస్తుతం గుర్తించిన ప్రభుత్వ భూమికి, జిరాయితీ భూమికి కూడా సరిహద్దులను పూర్తి చేశారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జనపాల అప్పలనాయుడు కుటుంబానికి ఎస్పీ తుహిన్‌సిన్హా బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులంతా తమ ఒక రోజు వేతనం రూ.3.78 లక్షలను సమకూర్చారు. ఆ మొత్తాన్ని మృతుడి భార్య సత్యవతికి ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి హోంగార్డులు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ టి.రమేశ్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

తల్లిపాలు శిశువులకు మేలుచేస్తాయి. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అనేకరకాల పోషకాలు అందిస్తాయి. పుట్టిన వెంటనే నవజాత శిశువుకు ముర్రుపాలను అందిస్తే అనారోగ్య సమస్యలు నుంచి కాపాడే అవకాశం ఉంటుంది. పిల్లలకు తల్లి ఒడి స్వర్గమైతే.. తల్లి పాలు అమృతం. ఇలాంటి అమృతాన్ని బిడ్డలకు ఇవ్వడంలో కొంతమంది తల్లులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా తల్లిపాలు అందించేలా చేసేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా ఏటా ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది బిడ్డకు తల్లిపాలను అందించేందుకు ప్రాధాన్యమివ్వడం.. అందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించడం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

తల్లిపాలలో చిన్నారులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. పుట్టిన ప్పటి నుంచి కొన్ని నెలల పాటు తల్లిపాలను అందించాలి. రెండేళ్ల వయసు వచ్చే వరకు తప్పనిసరి. నవజాత శిశువుకు బలవర్ధకమైన ఆహారం తల్లిపాలే. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన ప్రొటీన్లు, పోషకాలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలు తల్లిపాలలో లభిస్తాయి. చిన్నారులకు తప్పనిసరిగా ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. శిశువు పుట్టిన వెంటనే ఎదపై పడుకోబెట్టి తల్లి చనుమొన బిడ్డ నోటికి అందించి ముర్రు పాలు తాగించాలి. మొదటి రెండు రోజులు వచ్చే పాలను వైద్య పరిభాషలో కొలస్ట్రామ్ అంటారు. ఇందులో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది. పలు రకాల వ్యాధులను నివారించడంలో దోహదపడుతుంది. శిశువు ఆరోగ్యానికి రక్షణ కవచంలా నిలుస్తుంది.

సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం

- వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల
- తల్లుల ఆరోగ్యానికీ మేలు
- బిడ్డ ఎదుగుదలకు మొదటి రెండు రోజులు ఇచ్చే పాలు కీలకం
- నేటితో ముగియనున్న తల్లిపాల వారోత్సవాలు



వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ, సిబ్బంది

ప్రయోజనాలు ఎన్నో..

తల్లిపాలు తాగే పిల్లల్లో ఊబకాయం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని అనేక పరిశోధనల్లో తేలింది. పిల్లల్లో రోగనిరోధక శక్తితో పాటు సక్రమంగా ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఎముకల పుష్టి మెరుగ్గా ఉంటుంది. కొన్నిరకాల క్యాన్సర్లను నియంత్రించడంలో కీలకంగా పనిచేస్తుంది. మానసిక రుగ్మతలను దూరం చేసే సామర్థ్యం తల్లిపాల సొంతం.

పాలిచ్చే తల్లికీ మేలు..

బిడ్డ పాలు తాగడం వల్ల తల్లి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కాన్పు తరువాత వచ్చే కొన్నిరకాల మానసిక సమస్యలు దూరమవుతాయి. పాలిచ్చే స్త్రీలలో రొమ్ము, అండాశయ క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటుందని అధ్యయనాల్లో తేలింది. పాలిచ్చే తల్లులు రోజుకు అదనంగా 400 కేలరీలనిచ్చే ఆహారం తీసుకోవాలి.

పోషకాలు మెండు..

తల్లి పాలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. 100 మిల్లీలీటర్ల పాలలో 1.5 గ్రాముల ప్రొటీన్లు, 650 మి.లీ పాలలో 300 మైక్రో గ్రాముల విటమిన్ ఏ, 0.25 నుంచి 0.3 మైక్రో గ్రాముల విటమిన్ బి, 700 మిల్లీలీటర్ల పాలలో మూడు మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. ప్రసవం తరువాత బాలింతలు పోషకాహారం తీసుకోవాలి. ప్రతిరోజూ 600 గ్రాముల అన్నం, 200 గ్రాముల పప్పు, 150 గ్రాముల కూరలు, ఉడకబెట్టిన గుడ్డు, ఓ పండు, 100 మిల్లీలీటర్లు పాలు తీసుకోవాలి.



అవగాహన కల్పిస్తున్నాం



బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు అం దించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం కూడదు. దీనిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేందుకే వారోత్సవాలు. ఆపరేషన్, ఇతర కారణాలు, అపోహలతో చాలామంది తల్లిపాలను ఇవ్వడం లేదు. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఇబ్బందిగా పరిణమిస్తుంది. ఆరు నెలలపాటు కేవలం తల్లి పాలను అందించడం మేలు. దీనివల్ల తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుంది.

-రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, విశాఖ జిల్లా

అపోహలు విడనాడాలి

బిడ్డ పుట్టిన తరువాత కొందరు తల్లులు అపోహలతో బిడ్డకు పాలివ్వడం లేదు. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యాన్ని బలి చేసినట్టేనని నిపుణులు చెబుతున్నారు. పాలు జిగటుగా ఉం టాయని, బిడ్డ గొంతులోకి దిగవని భావిస్తుంటారు. మొదటిసారి తల్లి స్తనాల నుంచి వచ్చే పాలను గట్టిగా పీల్చాల్సి ఉం టుందన్న భావనతో కొందరు ఇవ్వడం లేదు. తల్లికి శస్త్రచికిత్స జరిగితే ఆమె మత్తులో ఉండగా పాలు ఇవ్వకూడదన్న భావనతో కొందరు దూరంగా ఉంచుతుంటారు. వైద్యుల సలహా మేరకు పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు అందించాలి.

వారోత్సవాల్లో కార్యక్రమాలు..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు జిల్లా, నియోజకవర్గ, మండల, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లి పాలతో కలిగే మేలు గురించి వివరిస్తున్నారు.

క్రైం... crime news

107 కిలోల గంజాయి స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచంగి గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం 107 కిలోల గంజాయిని రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ స్వాధీనం చేసుకున్నారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రూరల్ ఎస్ఐ తన సిబ్బందితో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టార న్నారు. ఆ సమయంలో ఒడిశా నుంచి చెన్నైకి గంజాయిని తరలిస్తున్న ఆటోను ఆపగా, ప్రధాన నిందితుడిగా భావిస్తున్న చెన్నైకి చెందిన వ్యక్తి పరారయ్యాడన్నారు. ఆటోలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకొని బుధవారం జువెనైల్ హోంకు తరలించామన్నారు. 107 కిలోల గంజాయి, ఆటో, సెల్‌ఫోన్, రూ.200ల నగదు స్వాధీనం చేసుకొని రూరల్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.

లంబసింగి ఘాట్‌లో మినీ వ్యాన్ బోల్తా

చింతపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి ఘాట్‌లో మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తూ అందులో వున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. బుధవారం మధ్యాహ్నం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ నుంచి తౌడు బస్తాలతో మినీ వ్యాన్ నర్సీపట్నం బయలుదేరింది. లంబసింగి ఘాట్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో వ్యాన్ అదుపు తప్పి లోయలో పడిపోయింది. వ్యాన్‌లో డ్రైవర్ దూరి గౌరీ శంకర్, మరో ఇద్దరు యువకులు చంద్రకిరణ్, పనసల ధర్మ వున్నారు. వీరు స్వల్ప గాయాలతో బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.



బోల్తాపడిన మినీ వ్యాన్

10లోగా బస్సులన్నీ కండిషన్‌లో ఉండాలి

- ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులకు డీపీటీవో ప్రవీణ సూచన



అద్దె బస్సుల యజమానులతో మాట్లాడుతున్న ప్రవీణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ నాటికి బస్సులన్నీ పూర్తిస్థాయిలో కండిషన్‌లో ఉండేలా తయారు చేయించాలని అద్దె బస్సుల యజమానులకు ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ స్పష్టం చేశారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 15వ తేదీ నుంచి చేపడుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగానే బస్సులను పరిశీలించి స్టీరింగ్, బ్రేకులు పటిష్ఠంగా పనిచేసేలా చూడాలన్నారు. మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లతో ఎప్పటికప్పుడు చర్చించి బస్సుల కండిషన్‌ను తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏడీఎం గౌరి, ఎంఎఫ్ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటస్ఫూర్తిని సజీవంగా ఉంచాలి

- ఏఐడీఎస్‌వో ప్రతినిధుల డిమాండ్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోరాట స్ఫూర్తిని సజీవంగా ఉంచాలని ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తికి సాక్ష్యాలుగా నిలిచిన అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏఐడీఎస్‌వో నగర కమిటీ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నర్సీపట్నంలో ఉన్న బ్రిటిష్ సైన్యాధికారులు స్కాట్‌కోవర్డ్, హైటర్ సమాధులు చారిత్రక కట్టడాలు మాత్రమే కాదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి, ఆయన అనుచరుల వీరోచిత పోరాటాలకు అవి సజీవ సాక్ష్యాలన్నారు. అటువంటి ప్రాధాన్యత ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం దారుణమన్నారు. ఈ చారిత్రక సమాధుల స్థలం ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలన్నారు. ఈ స్థలాన్ని పురావస్తుశాఖకు అప్పగించి సంరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దు

... 5వ పేజీ తరువాయి

తదితరులు బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. హెటిరో పరిశ్రమ కాలుష్యం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మత్స్యకారులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నామని అన్నారు.

వైసీపీ హయాంలోనే తొలి విడత ప్రజాభిప్రాయ సేకరణ

టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, నక్కపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ, 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన తరువాత ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారని అన్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి మొదటి విడత ప్రజాభిప్రాయసేకరణ జరిగిన విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. నిర్వాసిత రైతులకు వీలైనంత మంచి ప్యాకేజీ ఇప్పించేలా హోం మంత్రి అనిత కృషి చేస్తున్నారని చెప్పారు. ఇంకా టీడీపీ నాయకులు ఏజెర్ల వినోద్‌రాజు, వెలగా శ్రీను, గింజాల లక్ష్మణరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ తదితరులు ప్రజాభిప్రాయసేకరణకు అనుకూలంగా మాట్లాడారు. రైతులకు న్యాయం చేసి, స్థానిక యువతీ యువకులకు 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన తరువాత మాత్రమే భూసేకరణ, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులు చేపట్టాలని మరికొందరు కోరారు. అందరి అభిప్రాయాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయాలను, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేశారు.

అరుపులు, కేకలతో దద్దరిల్లిన వేదిక

ప్రజాభిప్రాయ వేదిక ఒకానొక దశలో అరుపులు కేకలతో దద్దరిల్లింది. ప్రభావిత గ్రామాల్లో సభలు ఏర్పాటుచేసి, తీర్మానాలు ఆమోదం పొందాలని డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. వేదిక బయట రైతులు, మత్స్యకారులతో కలిసి బైఠాయించారు. ప్రజాభిప్రాయ వేదిక వద్ద ఆందోళనకు దిగిన సీపీఎం నాయకుడు లోకనాథం, జిల్లా సీఐటీయూ కార్యదర్శి కోటేశ్వరరావు, స్థానిక రైతు సంఘ నాయకుడు అప్పలరాజు, సత్యనారాయణ, ఎం.రాజేశ్‌లను పోలీసులు అదుపులోకి అనకాపల్లి టౌన్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి 9, వైసీపీకి 1

... 5వ పేజీ తరువాయి

లెక్కింపు పూర్తయ్యేసరికి కూటమి మద్దతుతో పోటీ చేసిన కొణతాల నీలిమకు 58, గంకల కవితకు 57, దాడి వెంకటరామేశ్వరరావుకు 57, మొల్లి హేమలతకు 57, సేనాపతి వసంతకు 54, గేదెల లావణ్యకు 53, మాదంశెట్టి చినతల్లికి 52, రాపర్తి త్రివేణివరప్రసాదరావుకి 52, మొల్లి ముత్యాలకు 51 ఓట్లు రాగా వైసీపీకి చెందిన సాడి పద్మారెడ్డికి 50 ఓట్లు లభ్యమవడంతో వారంతా గెలుపొందినట్టు అధికారులు తేల్చారు. కూటమి మద్దతుతో పోటీకి దిగిన టీడీపీకి చెందిన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుకు 49 ఓట్లు రావడంతో రీకౌంటింగ్‌కు కూటమి నేతలు పట్టుబట్టారు. దీంతో అధికారులు మరోసారి ఓట్లు లెక్కించగా అదే ఫలితం వచ్చింది. ఆ సమయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి తమ అభ్యర్థికి 50 ఓట్లు వచ్చినా గెలుపును ప్రకటించడంలో జాప్యంచేస్తున్నారని, తక్షణం జోక్యంచేసుకోవాలని కోరారు. దీంతో కమిషనర్ ఓట్ల లెక్కింపు జరుగుతున్న హాల్‌కు వెళ్లి నాలుగు రౌండ్ల ఓట్లను పరిశీలించారు. అనంతరం అత్యధికంగా ఓట్లు సాధించిన పది మందిని గెలుపొందినట్టు ప్రకటించారు.

నల్లరాయి క్వారీ లారీలు అడ్డగింత

- ఆరుగురు దళితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాకవరపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్వారీ నుంచి నల్లరాయిని తరలిస్తున్న టిప్పర్ లారీలను అడ్డుకున్న ఆరుగురు దళితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని జి.కోడూరు రెవెన్యూ పరిధి 332 సర్వే నంబరులో నల్లరాయి క్వారీ వుంది. దీని చుట్టూ దళితులకు చెందిన పట్టా భూములు వున్నాయి. క్వారీ నుంచి భారీ బండరాళ్లను రాంబిల్లి మండలంలో ఏర్పాటవుతున్న ఎన్ఏఓబీకి రవాణా చేస్తున్నారు. ఇందుకోసం క్వారీలో పెద్ద ఎత్తున పేలుళ్లు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాళ్లు లేచి, తమ పొలాల్లో పడుతున్నాయని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని దళితులు ఆరోపిస్తున్నారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలని 15 రోజుల నుంచి నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం అర్ధరాత్రి సుమారు పది మంది దళితులు వెళ్లి, క్వారీ నుంచి వచ్చే లారీలకు ద్విచక్ర వాహనాలను అడ్డుగా పెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి, దళిత రైతులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్ఐ దామోదర్‌నాయుడును వివరణ కోరగా, లారీలను అడ్డుకున్నట్టు ఫిర్యాదు రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని, ఎటువంటి కేసులు నమోదు చేయకుండా బుధవారం రాత్రి విడిచిపెట్టినట్టు చెప్పారు.



మంగళవారం అర్ధరాత్రి టిప్పర్ లారీలను అడ్డుకున్న దృశ్యం



రాజన్నపేట నుంచి రేషన్ బియ్యంతో నడుచుకుంటూ గ్రామాలకు వెళుతున్న గిరిజనులు

రేషన్ కావాలంటే 8 కి.మీ.లు నడవాల్సిందే

- ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్న నాలుగు గ్రామాల గిరిజనులు

రోలుగుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని అర్ల పంచాయతీ శివారు పెదగరువు, కొత్తలోసింగి, పాత లోసింగి, పిత్రిగెడ్డ గ్రామాల గిరిజనులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో 80 కుటుంబాలు నివసిస్తున్నాయని, రేషన్ బియ్యంతోపాటు అంగన్‌వాడీ పిల్లలకు బాలామృతం, గర్భిణులకు పౌష్టికాహారం తీసుకురావాలంటే సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న శరభవరం పంచాయతీ రాజన్నపేటకు వెళ్లి రావాలని వాపోయారు. రవాణా సదుపాయం లేకపోవడంతో బియ్యం, ఇతర సరకులను కొండశిఖరంలో తమ గ్రామాలకు నడుచుకుంటూ తెచ్చుకోవాల్సి వస్తున్నదని చెప్పారు. తమ గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలో వుండడంతో ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపించారు. అధికారులు స్పందించి తమ గ్రామాలకు అందుబాటులో వుండేలా రేషన్ పంపిణీ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రొయ్యలు, చేపల ఉత్పత్తి పెంపునకు చర్యలు

- కలెక్టర్ విజయకృష్ణన్




అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపలు, రొయ్యల ఉత్పత్తి పెంపునకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో చేపల పెంపకంపై మత్స్య, వ్యవసాయ, నీటి పారుదల, కాలుష్య నియంత్రణ మండలి శాఖలతో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో సుమారు 172.68 ఎకరాల నాన్-ఆక్వా జోనేషన్ భూమిని ఆక్వా జోనేషన్‌గా (చేపల పెంపకం ప్రాంతంగా) మార్చేందుకు అనుమతి మంజూరు చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఈ నిర్ణయం వలన జిల్లాలో ఆక్వా రైతుల వ్యాపార నిర్వహణ మరింత సులభతరమవుతుందన్నారు. జిల్లాలో పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు చేపలు, రొయ్యల ఉత్పత్తిని పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం, విద్యుత్ సబ్సిడీ, అనుమతుల కోసం దరఖాస్తు ప్రక్రియ సులభతరం వంటి ప్రయోజనాలను ఆక్వా రైతులు పొందుతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖాధికారి జి.విజయ, తదితరులు పాల్గొన్నారు.

కోనాంలో జిల్లాస్థాయి ఆదివాసీ దినోత్సవం

- డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

చీడికాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయి ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు కోరారు. బుధవారం సాయంత్రం ఆయన కోనాంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అధికారులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహించడానికి కోనాం జలాశయం వద్ద ఉన్న ఖాళీ స్థలం అన్ని విధాలా అనుకూలంగా వుంటుందని నిర్ణయించారు. అనంతరం అందరూ కలిసి అక్కడకు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తామని, గిరిజనులు పండించిన పంటలను వీటిలో ప్రదర్శించేలా చూడాలని అన్నారు. పక్కనే ఒక దమ్ము మడిని ఏర్పాటుచేయాలని కోరారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ జిల్లా సాధికారిత అధికారి మంగవేణి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జయప్రకాశ్, ఎంపీడీవో హేమసుందరరావు, ఎంఈవో కె.బొంజుబాబు, ఏవో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.సింహాచలంనాయుడు, స్థానిక పెద్దలు చలుగు దేముడునాయుడు, జగన్నాథం మాస్టారు, ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం యు.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కోనాం జలాశయం వద్ద స్థల పరిశీలన చేస్తున్న డీఈవో, ఇతర అధికారులు

నర్సీపట్నానికి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

విస్తరించాలని ప్రతిపాదించారు.

కొత్త రహదారులకు ప్రతిపాదనలు

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త రహదారులను ప్రతిపాదించారు. బలిఘట్టం వై జంక్షన్ నుంచి శివపురం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వరకు, పెదబొడ్డేపల్లి పాత పంచాయతీ కార్యాలయం నుంచి శ్రీరామనగర్ కాలనీ వరకు, జయంతి కాలనీ మీదుగా చోడవరం రోడ్డు వరకు, పెదబొడ్డేపల్లి రావిచెట్టు జంక్షన్ కాపువీధి నుంచి శ్రీరామనగర్ వరకు, ఉత్తర వాహిని నుంచి బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వరకు 40 అడుగుల వెడల్పుతో, పెదబొడ్డేపల్లి పెద్దచెరువు నుంచి లక్ష్మీపురం ప్రతిపాదిత రింగ్ రోడ్డు వరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మించాలని మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారు.

తప్పని శవజాగారం

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చే వరకు మృతుల కుటుంబీకులు, బంధువులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ సమస్య గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం పోస్టుమార్టం భవన నిర్మాణానికి రూ.34 లక్షలు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులు పూర్తిచేసి అధికారులకు అప్పగించారు. శవపరీక్షకు అవసరమైన సామగ్రి సిద్ధం చేశామని, పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి వచ్చినట్టేనని నెలరోజుల క్రితం ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ ప్రకటించారు. కానీ ఇంతవరకు అందుబాటులోకి రాలేదు.

త్రీఫేజ్ కరెంటు రాలేదు

దినేశ్‌కుమార్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

పోస్టుమార్టం కేంద్రానికి త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశాం. ఫ్రీజర్‌కు త్రీఫేజ్ కరెంటు తప్పనిసరి. ఇటీవలే సూపరింటెండెంట్‌గా ఇక్కడకు వచ్చాను. ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి, త్వరగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా ప్రయత్నిస్తాను.



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PENTAKOTA SRINUVASA RAO (Old Name) S/o. Pentakota Ramana, Resident of: 4-109, Amberupuram, Chodavaram, Anakapalli. Change my Name from PENTAKOTA SRINUVASA RAO (Old Name) to PENTAKOTA SRINU (New Name) hence forth I am being called as PENTAKOTA SRINU (New Name) S/o. Pentakota Ramana, all purposes.
AJV_241641

CHANGE OF NAME

★ I, ANDRA LALITHA (Old Name) W/o. Andra Bhuvan Kumar, Resident of: 6-160, B.C. Colony, Nathavaram, Visakhapatnam. Change my Name from ANDRA LALITHA (Old Name) to UPPU LALITHA (New Name) hence forth I am being called as UPPU LALITHA (New Name) W/o. Andra Bhuvan Kumar, all purposes.
AJV_241642

FINANCE

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్థులకు సులభవాయిదా పద్ధతిలో 5లక్షల లోపు ఫైనాన్స్ చేయబడును. స్థిరాస్తిపై బ్యాంకులో లోను తీసుకున్నవారికి కూడా జిరాక్స్ పేపర్స్‌పై సెకండ్ మార్టిగేజ్ లోన్ చేయబడును. సెల్: 9396999669
AJD-244810

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి